వికలాంగుల కార్పొరేషన్‌లో ఖాళీలు భర్తీ చేయాలి

చాదర్‌ఘాట్: దివ్యాంగుల సంక్షేమశాఖ కార్పొరేషన్‌లో ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర వికలాంగుల నెట్‌వర్క్ అధ్యక్షుడు నల్లగొండ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మలక్‌పేటలోని జాతీయ వికలాంగుల పార్కులో ఆయన మాట్లాడుతూ.. వికలాంగుల సంక్షేమ శాఖను స్వతంత్ర శాఖగా కొనసాగించాలన్నారు. 33 జిల్లాలో ఏడీ ఆఫీసులు తెరవాలని కోరారు. ఓహెచ్, రోస్టర్ పాయింట్ 10లోపు మార్చుటకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. డ్రెస్ కోడ్ ఉద్యోగాలలో దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ విషయంలో కార్పొరేషన్ ఎండీ శైలజ, చైర్మన్ ముత్తినేని వీరయ్య చొరవ చూపి అమలుకు సహకరించాలని కోరారు.

నియామకం

మలక్‌పేట: బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధానకార్యదర్శిగా మూసారంబాగ్ డివిజన్‌కు చెందిన బొక్క మధుసూదన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీని మరింతగా బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీ చేపట్టే కార్యక్రమాలు విజయవంతం చేసే దిశగా ముందుకు సాగుతామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులైన వారందరికీ చేరే విధంగా పని చేస్తామని తెలిపారు. తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్‌కు, మలక్‌పేట నియోజకవర్గ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ప్లాస్టిక్ కవర్లను వినియోగించొద్దు



హోటల్స్ తనిఖీ చేస్తున్న సరూర్‌నగర్ సర్కిల్ డీసీ శ్రీనివాస్

దిల్‌సుఖ్‌నగర్: 120 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ కవర్లు, ప్యాకింగ్‌కు ఉపయోగించే సిల్వర్ కవర్లను వాడుతున్నారనే సమాచారంతో శుక్రవారం సరూర్‌నగర్ సర్కిల్ డీసీ శ్రీనివాస్ తనిఖీలు చేపట్టారు. హెల్త్ అండ్ శానిటేషన్ విభాగం, డిప్యూటీ ఇంజినీర్ (సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్) చందన చౌహాన్ సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని వివిధ హోటల్స్, స్వీట్ షాప్‌లో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్‌కు బదులు అరటి ఆకులు పేపర్ కవర్లు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ బుచ్చయ్య, జవాన్ వినోద్, ఎస్‌ఎఫ్‌ఏ, శివ, ప్రేమ్ కుమార్, చిరంజీవి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు కావాలి


స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

చంపాపేట: స్వచ్ఛభారత్‌లో ప్రతి ఒక్కరూ ప్రత్యక్షంగా భాగస్వాములు కావాలని జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం చంపాపేట బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని బైరామల్‌గూడ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన స్వచ్ఛభారత్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పాఠశాలలో పేరుకుని పోయిన చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు రాజేంద్రప్రసాద్, గీతారెడ్డి, నరేష్, లక్ష్మీప్రసాద్, మల్లేష్‌గౌడ్, యోగిరాజ్, కిరణ్, అమూల్యారెడ్డి, అవినాష్‌రెడ్డి, రాంపురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలు, ఉత్పత్తులను ఆదరించాలి



వనస్థలిపురం: చేనేత వస్త్రాలు, చేతి వృత్తులను ప్రోత్సహించాలని ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళా నిర్వాహకులు అక్బర్ అలీ అన్నారు. వనస్థలిపురం హెచ్‌ఎండీఏ కమ్యూనిటీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళా శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అక్బర్ అలీ మాట్లాడుతూ... మేళాలో పేరొందిన మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌస్స్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యూవెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, చెప్పులు, గాజులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని అన్నారు. ఈ అవకాశం కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని ఆయన తెలిపారు.

భూ భారతిపై పెరిగిన ఆశలు

పరిష్కారమైన దరఖాస్తులు 26,703



- పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య 4,773
- జిల్లాలో భూభారతిలో వచ్చిన దరఖాస్తులు 72,163
- తిరస్కరణకు గురైన దరఖాస్తుల సంఖ్య 30,607.
- ధరణి స్థానంలో 'భూ భారతి' చట్టం
- భూ సమస్యలు గట్టెక్కుతుండటంతో రైతుల్లో ఆనందం

సాక్షి,మేడ్చల్ జిల్లా: భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, భూ వివాదాల పరిష్కారానికి కాంగ్రెస్ సర్కారు 'ఆర్వోఆర్ చట్టం-2020 ధరణి' స్థానంలో నూతన రెవెన్యూ చట్టం 'భూ భారతి-2025'అమల్లోకి వచ్చిన తర్వాత భూ సమస్యల పరిష్కారం ఓ కొలిక్కి వస్తోంది. దీంతో గత ఐదారేళ్లుగా నిషేధిత భూముల జాబితా, పార్టు-బి భూములు, మిస్సింగ్ సర్వే నెంబర్లు, పేర్ల మార్పు, భూ హక్కులు, సాదాబైనామాల క్రమబద్ధీకరణ తదితర అపరిష్కృత సమస్యలు పరిష్కారమవుతాయని రైతుల్లో ఆశాభావం వ్యక్తమవుతోంది. భూ సమస్యల పరిష్కారం తహసీల్దార్ స్థాయిలో కాకపోతే.. ఆర్డీవో.. అక్కడి నుంచి కలెక్టర్‌కు అప్పీలు చేసుకునే అవకాశాన్ని నూతన చట్టంలో కల్పించడం.. అందుకు ట్రిబ్యునళ్ల ఏర్పాటు చేయడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

- మ్యుటేషన్లు, వారసత్వ బదిలీ, నాలా కన్వర్షన్స్, సక్సెషన్, పీవోబీ, పాస్ పుస్తకాల్లో తప్పుల సవరణలు, కొత్త పాసు పుస్తకాల జారీ తదితరాలకు సంబంధించి జిల్లాలో 4,491 దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయి. వీటిలో కీసర రెవెన్యూ డివిజన్ పరిధిలో 2,084 దరఖాస్తులు ఉండగా, మల్కాజిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలో 2,407 దరఖాస్తులు ఉన్నాయి. ధరణి పోర్టల్‌లో 35 రకాల ఆప్షన్స్(ఐచ్ఛికా)లను పొందుపరిచినా.. సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవటంతో.. వీటన్నింటికి భూభారతి కొత్త చట్టంలో పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ వర్గాలు తెలిపాయి.
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో భూ భారతిలో భాగంగా మొత్తం 72,163 దరఖాస్తులు అందగా,ఇందులో 30,607 దర ఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. 31,194 దరఖాస్తులు సక్రమంగా ఉన్నట్లు గుర్తించిన అధికార యంత్రాంగం వాటిని పరిశీలించటంతోపాటు పలు దఫాలుగా విచారణ నిర్వహించి, ఇప్పటి వరకు 26,703 దరఖాస్తులను పరిష్కరించినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. పెండింగ్‌లో ఉన్న 4,491 దరఖాస్తులను పరిశీలించటంతోపాటు పలు దశల్లో విచారించి, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

మేడ్చల్‌పై ప్రత్యేక దృష్టి..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్లమెంట్ సభ్యుడిగా ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉండటంతో ....భూభారతి అమలుపై రెవె న్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. జిల్లాలో ప్రభుత్వ భూములను చాలా మంది నకిలీ పత్రాలతో పట్టాలు చేసుకోవడం, పార్టు-బీ భూ ములు సైతం ' ఎక్కువగా ఉండటం తదితర కారణాల నేపథ్యంలో మేడ్చల్ జిల్లాపై స్పెషల్ ఫోకస్ పెడుతున్నట్లు తెలుస్తోంది.

రైతుల ఆశలు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని భూసమస్యలపై ఎంపీగా ఉన్న సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అనేక ఫిర్యాదులు, దరఖాస్తులు అందాయి. దీనికి తోడు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో భూసమస్యలు కూడా అధికంగానే ఉన్నాయి. పట్టాదారు పాసుపుస్తకాలు లేక కొందరు, రికార్డుల్లో తారుమారు కావటంతో మరిందరు ఇబ్బందులు పడుతున్నారు. భూభారతితో ఇలాంటి సమస్యలు తొలగిపోతున్నాయని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం


లబ్ధిదారుడికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌కు చెందిన కొండ సాయిరాంగౌడ్ కొంతకాలంగా కంటి సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. అతడి బంధువులు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. రెక్కాడితే కాని పూటగడవని సాయిరాంగౌడ్ ఆసుపత్రి చికిత్స బిల్లు చెల్లించటం భారంగా మారింది. అందినకాడికి అప్పుచేసి ఎట్టకేలకు బిల్లును చెల్లించారు. విషయం తెలుసుకున్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే బాధితుడితో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.45 వేలు మంజూరు కావటంతో శుక్రవారం ఆయన చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్‌గౌడ్, జగదీష్‌గౌడ్, చందు యాదవ్, శివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్సకు రూ.2లక్షల ఎల్‌ఓసీ...

మన్సూరాబాద్: డివిజన్ పరిధి మధురానగర్‌కాలనీకి చెందిన శివవరుణ్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స ఖర్చులు భరించలేక బీఆర్‌ఎస్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డిని బాధితుడు ఆశ్రయించాడు. విషయాన్ని మల్లారెడ్డి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. స్పందించిన ఎమ్మెల్యే చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.2లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. చెక్కును బాధిడుతుడికి శుక్రవారం ఆందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి, నర్రి వెంకన్న, సుగ్రీవ, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో అదనపు గదుల నిర్మాణాలు


వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి నిత్యం వైద్యం కోసం 1300 నుంచి 1500 మంది వస్తుంటారని, దీంతో ఆసుపత్రిలో స్థలం సరిపోవడం లేదని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఏరియా ఆసుపత్రిని ఆయన సందర్శించి ఆసుపత్రిలోని సమస్యలను సంబంధిత సూపరింటెండెంట్లు డా.నాగేందర్, డా.కృష్ణలను అడిగి తెలుసుకున్నారు. స్థలాభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రి ప్రాంగణంలో నూతన నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత ఆసుపత్రి లోపట ఉన్న ఫార్మసీ, రక్త పరీక్ష కేంద్రాన్ని అక్కడికి తరలిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంఓ రాజ్‌కుమార్, నాయకులు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, చింతల రవికుమార్, రవి ముదిరాజ్, సుమన్‌గౌడ్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

హామీ మేరకు ఉద్యోగాల భర్తీ చేయాలి

బీఆర్‌ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమార్

వనస్థలిపురం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఉద్యోగాలు భర్తీ చేయాలని, లేనట్లయితే నిరుద్యోగుల ఆగ్రహం చవిచూడాల్సివస్తుందని బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఉద్యోగాల భర్తీకి పాలకూరి అశోక్‌కుమార్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను చైతన్యపురి పోలీసులు భగ్నం చేసి ఆయనను చికిత్స నిమిత్తం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ప్రవీణ్ కుమార్ ఏరియా ఆసుపత్రిలో అశోక్‌కుమార్‌ను పరామర్శించి ఆరోగ్యం విషయమై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం 2లక్షల ఉద్యోగాల భర్తీ హామీ ఇచ్చి ఇప్పటి వరకు కేవలం 5089 ఉద్యోగ నియామకాలు మాత్రమే ఇచ్చిందన్నారు.

- అశోక్‌కుమార్ నిరుద్యోగుల కోసం ఆమరణ నిరాహారదీక్ష చేపడితే పోలీసులు ఆయనను అరెస్టు చేసి ఆసుపత్రికి తరలించడం అన్యాయమని అన్నారు. పోలీసులు నిరుద్యోగులను భయభ్రాతులకు గురిచేస్తున్నారని అన్నారు. ఇందిరాపార్కు వద్ద రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తామంటే అనుమతులు ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. ఉద్యోగాల భర్తీ పేరుతో నిరుద్యోగుల ఓట్లతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఇపుడు ఏ ముఖం పెట్టుకుని జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఓట్లకు వెళ్తారని ప్రశ్నించారు.

హామీ ఇస్తేనే దీక్ష విరమిస్తారు: అశోక్ భార్య సునీత

- ఉద్యోగాల భర్తీ కోసం అశోక్‌కుమార్ ఆమరణ నిరాహార దీక్షకు పూనుకోగా ఆయనను పోలీసులు బలవంతంగా ఆసుపత్రికి తరలించారని ఆయన భార్య సునీత పేర్కొన్నారు. అయినా ఉద్యోగాల భర్తీ ప్రకటన వచ్చేవరకు ట్రీట్‌మెంట్‌కు సహకరించనని అశోక్‌కుమార్ తెలిపారని ఆమె అన్నారు. పోలీసుల నిర్బంధం ఎక్కువగా ఉందని, ఆసుపత్రిలో కనీసం ఆయనను కుటుంబసభ్యులను కూడా కలువనివ్వడం లేదని ఆమె పేర్కొన్నారు. తన భర్త ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.




చికిత్స పొందుతున్న అశోక్

విద్యార్థులకు అభినందనలు

మలక్‌పేట: సెపక్ తక్రా పోటీలలో సైదాబాద్ మండల పరిధిలోని మూసారంబాగ్ డివిజన్ గడ్డిఅన్నారం ఏపీఎస్‌ఆర్ హైస్కూల్ విద్యార్థులు విజయం సాధించారు. విజయనగర్ కాలనీలో నిర్వహించిన 69వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోటీలలో అండర్-14 బాలికల విభాగంలో రన్నరప్‌గా నిలిచారు. ఈ క్రీడల్లో గెలుపొందిన వారు స్టేట్ క్రీడల్లో హైద్రాబాద్ జిల్లాకి ప్రాతినిధ్యం వహిస్తారని స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఓం హరికృష్ణ తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రాజేందర్, ఫిజికల్ డైరెక్టర్లు కట్ట శ్రీనివాస్, విక్రమ్‌కుమార్, ప్రకాశ్, ఉమా, సెరీనా, హరికృష్ణ, వెంకట్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా చిన్న చెరువు

మన్సూరాబాద్: చిన్నచెరువు ప్రాంగణం చెత్త డంపింగ్‌యార్డ్‌గా మారి అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారిందని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. ప్రశాంత్‌నగర్ కాలనీవాసుల విన్నపం మేరకు కార్పొరేటర్ చిన్నచెరువు పరిసరాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చిన్నచెరువు కట్టపై ఏర్పాటు చేసిన వాకింగ్‌ట్రాక్ మొత్తం చెత్తాచెదారంతో నిండిపోయి తీవ్ర దుర్వాసనను వెదజల్లుతుందన్నారు. కనీస వసతులు లేకపోవడం, రాత్రి వేళల్లో డ్రగ్స్, మద్యం సేవించేందుకు అడ్డాగా మారిపోవడంతో వాకర్స్ భయాందోళన చెందుతున్నారని తెలిపారు. హోటళ్లు, చికెన్ సెంటర్లలోని వ్యర్థాలను చెరువు ప్రాంగణంలో వేస్తుండటంతో పందుల సంచారం పెరిగిపోతుందని పేర్కొన్నారు. చెరువులోని వరదనీరు చేరే విధంగా అధికారులు ప్రణాళికలు చేపట్టాలన్నారు. నిర్దిష్టమైన ప్రణాళికలతో చిన్న చెరువు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పరమేష, మల్లిరార్జున్, ప్రతాప్‌రెడ్డి, ప్రసాద్, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ చెరువును సుందరంగా తీర్చిదిద్దుతాం



లింగోజిగూడ: సరూర్‌నగర్ చెరువును అన్ని విధాల అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దుతున్నామని లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సరూర్‌నగర్ చెరువుకట్టపై జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్‌పాటిల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. చెరువు కట్ట మరింత బలంగా చేయడంతో పాటు నూతన డ్రైయిన్‌లు న్‌లు ఏర్పాటు చేసి మురుగు నీరు చెరువులో కలుడకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెరువు కట్టపై చెత్త వేయకుండా చర్యలు తీసుకోని పచ్చదానాన్ని పెంపొదిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ అశోక్‌రెడ్డి, ఎస్‌ఎన్‌డీపీ ఎస్‌ఈ శ్రీనివాస్ రెడ్డి, ఈఈలు మాధవిలత, కార్తిక్, నారాయణ, రమేష్ బాబు, ఎల్‌బీనగర్ డీసీ మల్లిఖార్జున్‌రావు, సరూర్‌నగర్ డీసీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో శారీరక, మానసికోల్లాసం


భానునగర్‌లో ఓపెన్‌జిమ్ ప్రారంభించిన కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి

సైదాబాద్: నిత్యం వ్యాయామం చేయటం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసికంగా ఉల్లాసం కూడా పెరుగుతందని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని భానునగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆమె కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వైద్యుల సూచనల మేరకు రోజూ తగిన వ్యాయామం చేయటం ద్వారా శరీరం మరింత చురుగ్గా మారి మానసిక ఒత్తిళ్లను తగ్గిస్తుందని అన్నారు. ఇటీవల పలు కాలనీల్లో ఏర్పాటు చేస్తున్న ఓపెన్‌జిమ్‌లకు ఆయా కాలనీలవాసుల నుంచి మంచి ఆదరణ లభిస్తుందన్నారు. అందుకని డివిజన్‌లో అవకాశమున్న కాలనీల్లో ఓపెన్‌జిమ్‌లను ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు విద్యాసాగర్ రెడ్డి, వేణుమాధవ్‌రెడ్డి, నరేష్ నాయక్, నరసింహారెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యాహక్కు, పోక్సో చట్టంపై అవగాహన


సీనియర్ జడ్జి కిరణ్మయికి పూల బొకే అందజేస్తున్న విద్యార్థులు

మలక్‌పేట: మలక్‌పేట బీసీ హాస్టల్‌లలో శుక్రవారం హైద్రాబాద్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సిటీ సివిల్ కోర్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ జడ్జి కిరణ్మయి హాజరై.. లీగల్ సర్వీసెస్ యూనిట్‌లో నల్సా పథకంలో పిల్లల రక్షణ, విద్యార్థులకు విద్యాహక్కు, పోక్సో, ఇతర చట్టాలపై అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సేవలు ఎలా పొందాలో వారికి వివరించారు. హాస్టల్‌ను తనిఖీ చేసి సౌకర్యాలు పరిశీలించి పిల్లలతో మాట్లాడారు. హాస్టల్, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యుడు బి. సురేష్‌కుమార్, లతీఫ్ అహ్మద్, వార్డెన్ స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి.. నిందితుడికి జీవిత ఖైదు

రంగారెడ్డి కోర్టులు: చిన్నారిపై లైంగిక దాడి కేసులో నిందితుడైన దొలాగర్ మధుకర్ (48) కు జీవిత ఖైదు తోపాటు రూ.20వేల జరిమానా విధించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంకే పద్మావతి. అదేవిధంగా బాలికకు 10లక్షల పరిహారం చెల్లించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు న్యాయమూర్తి సిఫార్సు చేసింది. కోర్టు ఏపీపీ సునితా బర్ల, శోభా రాణి తెలిపిన కథనం మేరకు వివరాలివి... జిల్లెల గూడ ప్రాంతంలో నివసించే బాలిక 2017, అక్టోబర్ 04న ఉదయం తన సోదరితో కలిసి తమ మేనత్త ఇంటికి వెల్తుండగా, అదే కాలనీలో టైలరింగ్ వృత్తి చేసుకుంటున్న నిందితుడు మధుకర్ బాలికలను ఇంటికి పిలిచి మొదట బాధిత బాలిక సోదరికి బట్టల కొలతలు తీసుకుని తనను ఇంటికి పంపించేసి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. తిరిగి ఇంటికి చేరుకున్న సదరు బాలిక జరిగిన విషయాన్ని తన తల్లికి వివరించింది. ఇదే విషయమై బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మీర్‌పేట్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట దాఖలు చేశారు. సాక్షలను విచారించిన కోర్టు నిందితుడికి పైవిధంగా శిక్ష ఖరారు చేస్తూ శుక్రవారం తీర్పును వెలువరించింది.

వృద్ధురాలి కళ్లల్లో కారం చల్లి గొలుసు అపహరణ


వృద్ధురాలితో మాట్లాడుతున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

హస్తినాపురం: గుర్తు తెలియని మహిళముఖం గుర్తుపట్టకుండా ముసుగువేసుకుని ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి ఇంటికి వచ్చి చేయి కొరికి కంట్లో కారం చల్లి ఆమె మెడలో ఉన్న ఆరు తులాల రెండు బంగారు గొలుసులను తెంచుకుని పారిపోయిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సహార గేటెడ్ కమ్యూనిటీలో రామసుందరి(73) డాక్టర్ నిరంజన్ దంపతులు బహార్‌కాలనీలో నివాసం ఉంటున్నారు. డాక్టర్ నిరంజన్ శుక్రవారం ఉదయం 6.30గంటలకు వాకింగ్‌కు వెళ్లడారు. రామసుందరి వాష్‌రూంకి వెళ్లి బయటికి వచ్చే సరికి ఒక గుర్తు తెలియని మహిళ ముఖానికి ముసుగు వేసుకుని కారం చల్లి మెడలోని ఆరు తులాల రెండు బంగారు గొలుసులను తెంచుకుని పారిపోయిందని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సీసీ పుటేజీని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధురాలికి ధైర్యం చెప్పిన కార్పొరేటర్

మన్సూరాబాద్: దొంగతనం విషయం తెలుసుకున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శుక్రవారం ఉదయం బాధిరాలి ఇంటికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధురాలికి ఆయన ధైర్యం చెప్పారు. పోలీసులు త్వరిగతిన విచారణ చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఆదినారాయణరెడ్డి, రాఘవేందర్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకిన మహిళ మృతదేహం లభ్యం


భవాని మృతదేహాన్ని వెలికి తీసిన హైడ్రా, అగ్నిమాపక సిబ్బంది

చైతన్యపురి: భర్తతో గొడవ పడి భవాని అనే మహిళ సరూర్‌నగర్ స్టేషన్ పరిధిలోని చెరువులో దూకిన విషయం తెలిసిందే. సైదాబాద్ దుర్గాభవానినగర్ కాలనీలో నివసించే సెంట్రీ పనిచేసే పొల్ల సాయకుమార్, భవాని మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. మూడు రోజుల క్రితం ఇద్దరి మధ్య గొడవ కావటంతో భార్యపై సాయికుమార్ సైదాబాద్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం పెద్దల సమక్షంలో కౌన్సిలింగ్ చేశారు. గురువారం సాయంత్రం సరూర్‌నగర్ చెరువు వద్దకు వచ్చిన భవాని భర్తకు ఫోన్ చేసి చెరువులో దూకి చనిపోతున్నానని చెప్పింది. పోలీసులకు సమాచారం ఇవ్వటంతో ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి హైడ్రా, అగ్నిమాపక సిబ్బందిని రప్పించి ఆమె జాడ కోసం గాలింపు చేపట్టారు. చెరవు నీటిలో బురద ఉండటంతో రాత్రి వరకు వెతికినా భవాని జాడ దొరకలేదు. శుక్రవారం ఉదయం భవాని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం కోసం తరలించారు.

మేనకోడలే హంతకురాలు

- వీడిన సైదాబాద్ వృద్ధుడి హత్య కేసు మిస్టరీ
- రెండు రోజుల్లోనే ఛేదించిన పోలీసులు


కేసు వివరాలు వెల్లడిస్తున్న సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ బి.చంద్రమోహన్

సైదాబాద్: సైదాబాద్‌లో కొత్త ఇంటిలో ఒంటరిగా నిద్రిస్తున్న వృద్ధుడి హత్య కేసు మిస్టరీ వీడింది. రెండు రోజుల్లోనే కేసును ఛేదించిన సైదాబాద్ పోలీసులు హతుడి మేనకోడలే హంతకురాలిగా గుర్తించారు. హతుడు, హంతకురాలి కుటుంబాల మధ్య కొంత కాలంగా జరుగుతున్న పలు వివాదాల నేపథ్యంలోనే వృద్ధుడి హత్య జరిగిందని పోలీసులు తేల్చారు. శుక్రవారం సైదాబాద్ పోలీస స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ బి.చంద్రమోహన్ వివరాలు వెల్లడించారు. స్థానిక విష్ణునగర్‌లో నివసించే కూలీ కె.శివయ్య (70) తన పాత ఇంటి స్థలంలో కొత్త ఇల్లు నిర్మిస్తూ దగ్గరలోనే మరో ఇంటిలో కుటుంబంతో కలిసి అద్దెకు నివసిస్తున్నాడు. రోజూ కొత్త ఇంటికి రక్షణగా రాత్రి అక్కడ నిద్రించేవాడు. ఆదివారం రాత్రి కూడా అక్కడే పడుకున్నాడు. ఉదయం కుటుంబ సభ్యులు చూడగా మరణించి కనిపించాడు. అతని ఒంటిపై ఉండాల్సిన వెండి ఆభరణాలు కనిపించలేదు. మృతదేహం మెడపై గాయాలు కనపడ్డాయి. వారి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు వేగవంతం చేశారు.

- మృతుడు శివయ్య ఇంటి సమీపంలోనే అతని మేనకోడలు నేనావత్ మంగ (48) కుటుంబంతో కలిసి ఉంటుంది. ఇరు కుటుంబాల మధ్య ఇటీవల తరచూ గొడవలు అవుతున్నాయి. హత్య జరిగిన రోజు మధ్యాహ్నం కూడా శివయ్య కుటుంబం ఆమెను దూషించారు. ఇవన్నీ మనసులో పెట్టుకున్న మంగ ఆదివారం రాత్రి శివయ్య ఒక్కడే నిద్రిస్తుండటం చూసి వెళ్లి అతని ముఖంపై దిండుతో అదిమి, అక్కడే ఉన్న వైరు తీసుకొని మెడకు బిగించి హతమార్చింది. పోలీసుల దృష్టి మరల్చేందుకు అతని ఒంటిపై ఉన్న వెండి ఆభరణాలు తస్కరించింది. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని విచారించడంతో తన నేరాన్ని ఒప్పుకుంది. ఆమె ఇంటి నుంచి 30తులాల వెండి ఆభరణాలు, ఒక సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.